క్లుప్తంగా

అనుమతి లేని బడులపై చర్యలు తీసుకోవాలి

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: జిల్లాలో అనుమతి లేకుండా నిర్వహిస్తున్న పాఠశాలలపై వెంటనే చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి రాజు పేర్కొన్నారు. ఈమేరకు జిల్లా కేంద్రంలోని కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల నుంచి రూ. లక్షలు దండుకుంటున్నారని, ప్రభుత్వం వెంటనే స్పందించి ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని పేర్కొన్నారు. విద్యాశాఖ అధికారులు పాఠశాలలను తనిఖీలు చేసి నిబంధనలు పాటించని వాటిపై చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నాయకులు రాము, లక్ష్మణ్, పవన్, రాజశేఖర్, సురేష్, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

నీట్‌లో గందరగోళంపై నిరసన

మహబూబ్‌నగర్ ఎడ్యుకేషన్: నీట్ పరీక్షలో జరిగిన గందరగోళంపై విచారణ జరిపించి అందరికీ న్యాయం చేయాలని ఏబీవీపీ నాయకులు డిమాండ్ చేశారు. ఈమేరకు పీయూ ముఖ ద్వారం వద్ద ఏర్పాటు చేసిన నిరసన కార్యక్రమంలో నాయకులు పాల్గొన్నారు. ఒకే పరీక్ష కేంద్రంలో ఎక్కువ సంఖ్యలో విద్యార్థులకు ర్యాంకులు రావడం అనుమానాలకు తావిస్తుందని, అందరి సందేహాలను నివృత్తి చేసే విధంగా సరైన విచారణ జరిపి న్యాయం చేయాలన్నారు. కార్యక్రమంలో అర్జున్, తదితరులు పాల్గొన్నారు.

ప్రిన్సిపాల్‌గా నారాయణగౌడ్

నారాయణపేట రూరల్: జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్‌గా నారాయణగౌడ్ నియమితులయ్యారు. సూర్యలక్ష్మి డిగ్రీ కళాశాల గత ప్రభుత్వ హయాంలో ప్రభుత్వ పరం అయ్యాక చిట్టెం నర్సిరెడ్డి మెమోరియల్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలగా మార్పు చేశారు. ఈ క్రమంలో 2022 ఆగస్టు 25న ఇదే కళాశాలలో పనిచేస్తున్న సీనియర్ అధ్యాపకులు రంగారెడ్డిని ప్రిన్సిపాల్‌గా నియమించారు. నాటి నుంచి నేటివరకు కొనసాగిన ఆయన అనారోగ్య కారణాలతో బాధ్యతల నుంచి వైదొలిగారు. ఈ మేరకు ఆయన తదుపరి సీనియర్‌గా ఉన్న భౌతికశాస్త్రం అధ్యాపకులు ఈ.నారాయణగౌడ్ ప్రస్తుతం కళాశాలలో పరీక్షల విభాగం అధికారిగా కొనసాగుతున్నారు. ఆయనకు ఎఫ్ఏసీ ప్రిన్సిపాల్ బాధ్యతలు అప్పగిస్తూ ఉత్తర్వులు వెలుబడ్డాయి. దీంతో బుధవారం ఆయన రంగారెడ్డి సమక్షంలో బాధ్యతలు స్వీకరించారు.

కరాటేతో ఆత్మరక్షణ



నారాయణపేట రూరల్: చిన్నతనంలోనే కరాటే శిక్షణ పొందితే జీవితంలో ఎవరికి వారు ఆత్మరక్షణ పొందేందుకు ఎంతో ఉపకరిస్తుందని ఎస్పీ యోగేష్ గౌతమ్ అన్నారు. పట్టణంలోని కరాటే మాస్టర్ అశోక్ వద్ద నాలుగేళ్లుగా శిక్షణ పొందిన ఆరాధ్య, అభిలాష్, నితిన్, వరుణ్‌లకు బుధవారం ఎస్పీ చేతుల మీదుగా బ్లాక్‌బెల్టులను ప్రధానం చేశారు. అనంతరం ఎస్పీ మాట్లాడుతూ.. చదువుతోపాటు కరాటే నేర్చుకోవాలని, ప్రతి పాఠశాలలో విరామ సమయంలో శిక్షణ ఇవ్వాలని సూచించారు. తల్లిదండ్రులు సైతం కరాటే నేర్పించేందుకు ఆలోచించాలన్నారు.



ఎల్ఐసీ కార్యాలయం వైపు నిలిచిన వాహనాలు



రైల్వేబ్రిడ్జ్ వద్ద నిలిచిపోయిన ఇటుక లారీ



గౌడ ఫంక్షన్‌హాల్ మార్గంలో వాహనాల రద్దీ

జడ్చర్లలో భారీగా ట్రాఫిక్‌జాం

జడ్చర్ల టౌన్: మున్సిపాలిటి పరిధిలోని సిగ్నల్‌గడ్డపై బుధవారం మధ్యాహ్నం భారీగా ట్రాఫిక్ జాం అయ్యింది. రైల్వే బ్రిడ్జ్ పక్కన ఇటుకల లారీ పాడవటంతో ట్రాఫిక్ సమస్య ఉత్పన్నం అయ్యింది. దీంతో వాహనదారులు తీవ్ర అసౌకర్యానికి గురయ్యారు. 167వ నంబరు జాతీయరహదారిపై రోడ్డు విస్తరణ పనులు కొనసాగుతున్నాయి. దీనికి తోడు రైల్వేబ్రిడ్జ్ ఇరుకుగా ఉండటంతో వాహనాల రాకపోకలకు ఇబ్బంది ఏర్పడింది. అటు ఎల్ఐసీ కార్యాలయం, ఇటు డిగ్రి కళాశాల హాస్టల్ భవనం, పట్టణంలో రాఘవేంద్రస్వామి టాకీస్ వరకు పెద్ద సంఖ్యలో వాహనాలు నిలిచిపోయాయి. దీంతో పోలీసులు రంగప్రవేశం చేసి గంట పాటు శ్రమించి వాహనాల రాకపోకలను క్రమబద్ధీకరించారు. సిగ్నల్‌గడ్డపై ట్రాఫిక్ జాం కావటంతో నల్లగుంట నుంచి గౌడ ఫంక్షన్‌హాల్‌పక్క నుంచి వెళ్లే రోడ్డు సైతం రద్దీగా మారింది. అక్కడ వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వాస్తవంగా పట్టణంలో వాహనాల రాకపోకలకు ప్రత్యామ్నాయ మార్గాలు కల్పించకపోవటంతో తరచూ సమస్య ఏర్పడుతోంది. ఇప్పటికైనా అధికారులు, పాలకులు స్పందించి ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉంది.

ప్రజాప్రతినిధుల సహకారం మరువలేనిది



బీఆర్ఎస్ నాయకులతో ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఆల

భూత్పూర్: ప్రజా ప్రతినిధులకు అండగా ఉండి సేవా కార్యక్రమాలకు సహకారం అందిస్తామని ఎమ్మెల్సీ నవీన్ రెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని అన్నాసాగర్‌లో మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి, ఆల మంజుల దంపతులను ఆయన శాలువా, బొకెలతో సత్కరించారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్ రెడ్డి తన గెలుపునకు కృషి చేశారని అన్నారు. ప్రజాప్రతినిధుల సహకారం, ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ఇచ్చిన స్ఫూర్తిని మరువలేమని పేర్కొన్నారు. సరికొత్త రికార్డును సృష్టించిన మహబూబ్‌నగర్ జిల్లా ప్రజాప్రతినిధులకు తన వంతు సహాయ సహకారాలు అందిస్తున్నానని నవీన్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో దేవరకద్ర నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన జెడ్పీటీసీలు, ఎంపీపీలు, భూత్పూర్, కొత్త కోట మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీటీసీలు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

నవాబుపేట: మండల పరిధిలోని కారుకొండ సమీపంలో బైక్, కారు ఢీకొన్న ఘటనలో ఓ యువకుడితో పాటు మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. వివరాలు ఇలా.. వికారాబాద్ జిల్లా చౌడాపూర్ మండలం మందిపాల్‌కు చెందిన చంద్రకాంత్ బుధవారం తన గ్రామం నుంచి పోలేపల్లి సెజ్‌లో ఉద్యోగం నిమిత్తం ద్విచక్ర వాహనంపై వెళ్తున్నాడు. అదేసమయంలో కారుకొండ సమీపంలో గ్రామం నుంచి గేట్ వరకు ఓ కారు వస్తోంది. రెండు వాహనాలు ఢీ కొట్టుకోవడంతో చంద్రకాంత్‌కు, అదేవిధంగా లిఫ్ట్ అడిగి బైక్ ఎక్కిన మరో మహిళకు గాయాలయ్యాయి. దీంతో అక్కడ ఉన్నవారు ఇద్దరిని 108 వాహనంలో చికిత్స నిమిత్తం జిల్లా ఆస్పత్రికి తరలించారు. కాగా ఘటనా స్థలాన్ని సందర్శించిన హెడ్‌కానిస్టేబుల్ సురేష్‌బాబు ఈ మేరకు దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

భగీరథ పైప్‌లైన్‌కు మరమ్మతు

సాక్షి ఎఫెక్ట్..

అడ్డాకుల: మూసాపేట మండలం తుంకినీపూర్ స్టేజీ వద్ద 44వ నంబర్ జాతీయ రహదారి పక్కన మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు ఏర్పడిన లీకేజీని గ్రామ పంచాయతీ అధికారులు బాగు చేయించారు. నాలుగైదు రోజుల నుంచి ఇక్కడ మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ ఏర్పడి పెద్ద ఎత్తున నీళ్లు రహదారి పక్కన నిలిచాయి. దీనిపై బుధవారం సాక్షి దినపత్రికలో 'మిషన్ భగీరథ పైప్‌లైన్‌కు లీకేజీ' శీర్షికన కథనం ప్రచురితమైంది. దీంతో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ రాజు స్పందించారు. గ్రామ పంచాయతీ కార్యదర్శి మహేందర్ చెప్పి గ్రామ పంచాయతీ సిబ్బందితో లీకేజీని బాగు చేయించారు. పైప్‌లైన్‌పై మట్టిని తీసి ప్లాస్టిక్ పైపుకు పడిన రంధ్రాన్ని మూసి వేయడంతో సమస్య తీరింది.



పనులు చేయిస్తున్న కార్యదర్శి మహేందర్

పనులు త్వరితగతిన పూర్తిచేయాలి

గండేడ్/మహమ్మదాబాద్: గ్రామాల్లో హరితహారానికి తగిన ఏర్పాట్లు చేసుకోవాలని ఎంపీడీఓ దేవన్న పేర్కొన్నారు. మంగళవారం ఆయన మహమ్మదాబాద్, గండేడ్ మండలాల్లోని పలు గ్రామాల్లో పర్యటించారు. ముందలితండా, మొకర్లాబాద్, అంచన్‌పల్లి తదితర గ్రామాల్లో పాఠశాలలను నర్సరీలను పరిశీలించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ త్వరలో ప్రారంభం అయ్యే హరితహారం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటడానికి గాను గుంతలు తవ్వడంపై దృష్టి సారించాలన్నారు. లక్ష్యం మేరకు గుంతలు తవ్వడం పూర్తి చేయాలన్నారు. పాఠశాలల్లో అసంపూర్తిగా ఉన్న అన్ని పనులు త్వరిత గతిన పూర్తి చేయాలన్నారు. పాఠశాలలు ప్రారంభం కావడంతో విద్యార్థులకు ఇబ్బందులు కలిగే అవకాశం ఉందని దీన్ని దృష్టిలో ఉంచుకొని వెంటనే పనులు పూర్తి చేసేలా చూడాలని ఆయన కాంట్రాక్టర్లను కోరారు. ముఖ్యంగా టాయిలెట్లు, కరెంట్, తాగునీటి వసతులు వెంటనే చేపట్టాలని అన్నారు. పాఠశాలల్లో విద్యార్థులకేలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.



ముందలి తండాలో పాఠశాలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ దేవన్న

ఆర్థికసాయం

దేవరకద్ర: చిన్నరాజమూర్‌లో హరిజన్ రాజు బుధవారం మృతి చెందగా బాధితకుటుంబాన్ని జీకేఆర్ ఫౌండేషన్ చైర్మన్, కాంగ్రెస్ నాయకుడు రాజశేఖర్ పరామర్శించారు. రూ. 5 వేల ఆర్థికసాయం అందించారు. పార్టీ అండగా ఉంటుందని ధైర్యం చెప్పారు. మండల ఓబీసీ సెల్ అధ్యక్షుడు గోపాల్, గోవర్ధన్, ప్రేమ్‌కుమార్, భరత్, రాజేందర్, హన్మేషచారి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

కోయిల్‌కొండ: కేశ్వాపూర్ తండాకి చెందిన కిషన్‌నాయక్ అనారోగ్యంతో బాధపడుతున్న నేపథ్యంలో.. మండల ఫొటో, వీడియో గ్రాఫర్ సంఘం నాయకులు రూ.10వేల ఆర్థికసాయం అందించారు. సంఘం అండగా ఉంటుందని భరోసా కల్పించారు. ఫొటోగ్రాఫర్లు పరందాములు, బి.శేఖర్, బండినాగరాజు, రమేష్, శ్రీను, రమేష్, ఆనంద్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

గోరక్షణకు చర్యలు అవసరం



వినతిపత్రం అందజేస్తున్న వీహెచ్‌పీ ప్రతినిధులు

స్టేషన్ మహబూబ్‌నగర్: గోరక్షణ కోసం పటిష్ట చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని.. ఈ మేరకు భద్రత కల్పించాలని కోరుతూ విశ్వహిందూ పరిషత్, గోరక్షణ విభాగం ప్రతినిధులు బుధవారం జిల్లా కేంద్రంలో ఏఎస్పీ రాములుకు వినతిపత్రం అందజేశారు. రానున్న బక్రీద్‌ను దృష్టిలో ఉంచుకుని గోవధ జరగకుండా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు. హిందూవుల మనోభావాలు దెబ్బతీస్తూ, సర్వదేవతల నిలయమైన గోవులను చంపడం దారుణమని వినతిలో పేర్కొన్నారు. నామమాత్రపు చెక్‌పోస్టులు పెట్టి ఎక్కడా కూడా పటిష్టమైన నిఘా ఏర్పాటు చేయడం లేదని, ఇప్పటికైనా పటిష్ట చర్యలు తీసుకోవాలని కోరారు. వీహెచ్‌పీ ప్రతినిధులు రాచాల జనార్దన్, హన్మంతు, లక్ష్మీనారాయణ, శ్రీకాంత్, బజరంగ్‌దళ్ కార్యకర్తలు శ్రావణ్‌కుమార్, జయంత్, భరత్ తదితరులు ఉన్నారు.

ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలి

ఈనెల 9న వైష్ణోదేవి దర్శనం కోసం వెళుతున్న యాత్రీకుల బస్సుపై ఉగ్రవాదులు దాడి చేసి పది మంది యాత్రికులను విచక్షణ రహితంగా కాల్చి చంపడం హేయమైన చర్య అని నాయకులు అన్నారు. దాడికి పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని కోరుతూ జిల్లా విశ్వహిందూ పరిషత్ తరపున బుధవారం జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఏఓకు వినతిపత్రం అందజేశారు.

కొత్త సబ్‌స్టేషన్ల ఏర్పాటుకు చర్యలు

మహమ్మదాబాద్: మండలంలో రెండు కొత్త సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం విద్యుత్ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ మహమ్మదాబాద్ మండలంలో మెరుగయిన విద్యుత్ సరాఫరా కోసం గాధిర్యాల్, అన్నారెడ్డిపల్లిలో కొత్తగా రెండు సబ్‌స్టేషన్లు ఏర్పాటు చేయనున్నట్లు ఆయన తెలిపారు. అన్నారెడ్డిపల్లిలో స్థలం చూయిస్తే తక్షణం సబ్‌స్టేషన్ ఏర్పాటుకు కృషి చేస్తామన్నారు. గాధిర్యాల్ గ్రామంలో కూడా స్థలం సమకూరుస్తే త్వరలో సబ్‌స్టేషన్ నిర్మాణానికి కృషి చేస్తామన్నారు. మండలంలో ఎక్కడా కూడ విద్యుత్ సరఫరాలో అంతరాయ లేకుండా చూడాలని ఆయన అధికారులను కోరారు. మండల పరిధిలో చాలా చోట్ల లూప్‌లైన్లు ఉన్నాయని వాటిని వెంటనే సరిచేయాలని సూచించారు. ఎలాంటి మెటీరియల్ అవసరం ఉన్న తమవంతు సహకారం అందిస్తామన్నారు. ట్రాన్స్‌కో ఏడీ మద్దిలేటి, ఏఈలు సత్యం, శ్రీకాంత్, కాంగ్రెస్ జిల్లా ఉపాధ్యక్షుడు విష్ణువర్ధన్‌రెడ్డి, మండల అధ్యక్షుడు కేఎం నారాయణ, డీసీసీబీ మాజీ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎంపీపీ శాంతి, వైస్ ఎంపీపీ రాధారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

జోరుగా సాగుతున్న పనులు



బస్వాయపల్లి రహదారిలో గుంతలు తీసి మొక్కలు నాటుతున్న కూలీలు



దేవరకద్ర పెద్దచెరువు కాల్వలో ముళ్ల చెట్లను తొలగించడంతో పారుతున్న వర్షంనీరు

దేవరకద్ర: వేసవి ఎండలు కనుమరుగయి వర్షాలు కురుస్తు వాతవరణం చల్లగా మారడంతో ఉపాధి పనులు జోరుగా సాగుతున్నాయి. బస్వాయపల్లి రహదారికి ఇరువైపుల గుంతలు తీసి మొక్కలు నాటే కార్యక్రమం జోరుగా సాగుతున్నది. అలాగే దేవరకద్ర పెద్ద చెరువు కింద ఉన్న పంట కాల్వల పూడిక తీత పనులు గత వారం రోజులుగా సాగుతున్నాయి. ఒక పక్క వర్షం పడి కాల్వలో నీరు వస్తున్నా పనులు మాత్రం కొనసాగాయి. ముళ్ల చెట్లను తొలగించి మట్టిని తీసి కాల్వల్లో నీరు పారే విధంగా మార్చారు. ఇంకా వివిధ గ్రామాలలో ఉపాధి పనులు కొనసాగుతున్నాయి. వర్షాలు కురిసినా వ్యవసాయ పనులు ప్రారంభం కాక పోవడంతో కూలీలు ఉపాధి పనుల్లో పాల్గొంటున్నారు.

ఎమ్మెల్యేకు స్వాగతం పలికిన నాయకులు

దేవరకద్ర: విదేశీ పర్యటన ముగించుకుని బుధవారం దేవరకద్ర నియోజకవర్గానికి వచ్చిన ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డికి మండల నాయకులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు అంజిల్‌రెడ్డి పుష్పగుచ్ఛం అందజేశారు. నాయకులు వర్మ, వేణుగోపాల్‌రెడ్డి, నర్సింహారెడ్డి, శ్రీనివాస్, చంద్రమౌళి, వెంకటయ్య ఉన్నారు.



విద్యుత్‌షాక్‌తో గేదెమృతి

కోయిల్‌కొండ: కొత్లాబాద్‌లో రైతు మైబన్నగౌడ్‌కు చెందిన గేదె బుధవారం మధ్యాహ్నం ప్రమాదవశాత్తు విద్యుత్ షాక్ తగిలి అక్కడికక్కడే మృతిచెందింది. తన వ్యవసాయ పొలం సమీపంలో విద్యుత్ వైర్లు కిందకి ఉండడంతో ఘటన చోటుచేసుకుందని రైతు వాపోయారు. సుమారుగా రూ. 50వేలు నష్టం వాటిల్లిందని తెలిపారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు.

ప్రభుత్వ బడుల్లో విలువలతో కూడిన విద్య



చిన్నచింతకుంటలో దుస్తులు అందజేస్తున్న జెడ్పీ చైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్‌రెడ్డి



జడ్చర్లలో యూనిఫాం పంపిణీ చేస్తున్న జెడ్పీసీఈఓ రాఘవేందర్ రావు తదితరులు



ఇస్రంపల్లి పాఠశాలలో..

సాక్షినెట్‌వర్క్: ప్రభుత్వ పాఠశాలల్లో నైతిక విలువలతో కూడిన విద్య అందిస్తున్నట్లు జెడ్పీ సీఈఓ రాఘవేందర్‌రావు అన్నారు. జడ్చర్ల మున్సిపాలిటీలోని తెలుగు మీడియం ప్రాథమిక పాఠశాలలో బుధవారం విద్యార్థులకు యూనిఫాంలు పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పాఠశాలను పునఃప్రారంభం సందర్భంగా మామిడి తోరణాలు, రంగవల్లులతో అలంకరించడంతో పాటు మంగళ వాయిద్యాలతో విద్యార్థులు, తల్లి దండ్రులను ఆహ్వానించడం అభినందనీయమన్నారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలు చేపట్టిన మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేస్తున్నట్లు తెలిపారు. జెడ్పీ వైస్‌చైర్మన్ కోడ్గల్ యాదయ్య మాట్లాడుతూ.. పాఠశాలల అభివృద్ధికి రూ. 56 లక్షలు కేటాయించినట్లు తెలిపారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ దోరెపల్లి లక్ష్మి, ఎంఈఓ మంజులాదేవి, జెడ్పీ ప్లానింగ్ కోఆర్డినేటర్ గోవర్ధన్, కౌన్సిలర్ జ్యోతి, హెచ్‌ఎం శారద, ఉపాధ్యాయులు, నాయకులు పాల్గొన్నారు. కాగా మండలంలో తొలిరోజు హాజరు తక్కువగా నమోదైంది.

- జెడ్పీచైర్‌పర్సన్ స్వర్ణసుధాకర్ రెడ్డి బుధవారం చిన్నచింతకుంటలోని కేజీబీవీ, ప్రాథమిక పాఠశాలల్లో ప్రభుత్వం అందించే ఏకరూప దుస్తులు, నోట్‌బుక్‌లు, పుస్తకాలు అంజేశారు. సీఎం రేవంత్ రెడ్డి ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు కృషి చేస్తున్నాడన్నారు. కార్యక్రమంలో ఎంపీపీ హర్షవర్ధన్‌రెడ్డి, ఎంపీటీసీ ఉషారాణి, ఎంపీడీఓ సురేందర్‌రెడ్డి, ఎంఈఓ లక్ష్మణ్‌సింగ్ పాల్గొన్నారు.
- కొకుంట్ల మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు పుస్తకాలు, నోట్ పుస్తకాలు, దుస్తులను బుధవారం అందజేశారు. ఎంపీటీసీ కిష్టన్న, వైస్ ఎంపీపీ తుమ్మల సుజాత, శేఖర్‌రెడ్డి, హెచ్‌ఎం సుమన్ మహారాజ్, విద్యా కమిటీ చైర్మన్ నీలిరాధ తదితరులు పాల్గొన్నారు.
- మిడ్జిల్ మండలంలో మొదటి రోజు విద్యార్థులు తక్కువ సంఖ్యంలో హాజరయ్యారు. మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో కేవలం ఒక్క విద్యార్థి మాత్రమే హజరుకావడం గమనార్హం.
- నవాబుపేట పరిధిలో చాలా వరకు తక్కువ సంఖ్యలోనే విద్యార్థులు పాఠశాలలకు హాజరయ్యారు. దయపంతులపల్లి, హాజిలాపూర్, కుమ్మరిగడ్డతండా, పున్యనాయక్‌తండా, పోమాల్, కామారం పాఠశాలలో సంఖ్య పదిలోపే పరిమితం అయింది.
- భూత్పూర్ పరిధిలో మున్సిపల్ చైర్మన్ బస్వరాజ్ గౌడ్ దుస్తులు పంపిణీ చేశారు. మాజీ సర్పంచ్ నారాయణ గౌడ్, హెచ్‌ఎం యాదయ పాల్గొన్నారు.
- అడ్డాకుల, మూసాపేట మండలాల్లోని అన్ని గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు బుధవారం ప్రారంభమయ్యాయి. పాఠశాలకు వచ్చిన విద్యార్థులకు హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కలిసి యూనిఫాంలు, పుస్తకాలను పంపిణీ చేశారు. మూసాపేట మండలంలోని తుంకినీపూర్‌లో హెచ్‌ఎం లక్ష్మణ్‌గౌడ్ పుస్తకాలు, దుస్తులను అందజేశారు.



మిసగొండ్లపల్లిలో..



భూత్పూర్‌లో..



కొకుంట్లలో..

కార్పొరేట్‌కు దీటుగా..



యూనిఫాంలను అందజేస్తున్న ఎమ్మెల్యే పర్ణికారెడ్డి

తెలంగాణ రాష్ట్రంలో కార్పొరేట్‌కు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో ఉన్నత విద్య అందించేలా తమ ప్రభుత్వం కృషి చేస్తోందని నారాయణపేట ఎమ్మెల్యే డాక్టర్ చిట్టెం పర్ణికారెడ్డి అన్నారు. బుధవారం మండలంలోని తిర్మలంపల్లిలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో పాల్గొని నోటుపుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. జెడ్పీటీసీ విజయ్‌భాస్కర్‌రెడ్డి, మండల విద్యాధికారి లక్ష్మణ్‌సింగ్‌నాయక్, విద్యాసాగర్‌గౌడ్, మోహన్‌రెడ్డి, రవినాయక్, సత్యపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

విద్యకు పెద్దపీట..



యూనిఫాంలు అందజేస్తున్న పరిగి ఎమ్మెల్యే రామ్మోహన్‌రెడ్డి

పేద విద్యార్థులు చక్కగా చదువుకొని ఉన్నత స్థాయిలో రాణించేందుకు ప్రభుత్వం గ్రామీణ విద్యకు పెద్దపీట వేస్తోందని ఎమ్యేల్యే రామ్మోహన్ రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం గండేడ్ మండల కేంద్రంలో ఉన్నత పాఠశాలలో కార్యక్రమంలో పాల్గొన్నారు. విద్యార్థులకు నోటు పుస్తకాలు, యూనిఫాంలను పంపిణీ చేశారు. అనేక వసతులు ఉన్న ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపించాలని ఆయన విద్యార్థుల తల్లిదండ్రులను కోరారు. ఎంపీడీఓ దేవన్న, ఎంఈఓ వెంకటయ్య, పీఏసీఎస్ చైర్మన్ లక్ష్మీనారాయణ, ఎంపీటీసీ బాలయ్య, కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి పుల్లారెడ్డి, మండల అధ్యక్షుడు జితేందర్‌రెడ్డి, మాజీ సర్పంచ్ ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.

వృథాగా తాగునీరు..

మరికల్: మండల కేంద్రంలో ఓ వాటర్ ట్యాంకర్ అపరిశుభ్రతపై పలుమార్లు అధికారుల దృష్టికి తీసుకెళ్లిన ఎవరూ పట్టించుకోవడం లేదు. ప్రత్యేక అధికారి పాలనలోనైన తీరు మారుతుందా అన్నుకున్న మారలేదు. దీంతో ట్యాంక్ అపరిశుభ్రంగా ఉండటమే కాకుండా నిత్యం నీళ్లు ఇలా వృథాగా పోతున్నాయి. ట్యాంక్‌ను శుభ్రపర్చాలని, అలాగే వృథా నీటిని అరికట్టాలని కాలనీవాసులు కార్యదర్శిని కోరుతున్నారు. లేకుంటే కలుషిత నీరు తాగడంతో అంటు వ్యాధులు వ్యాపించే ప్రమాదం ఉందని వారు ఆందోళన వ్యక్తం చేశారు.